మళ్లీ రోడ్డు కబ్జాకు యత్నం

- అడ్డుకున్న స్థానికులు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు, సర్కిల్‌లో రోడ్డు ఆక్రమణకు యత్నిస్తున్న వ్యక్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: పలు కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారిని కబ్జా చేసేందుకు కొంత మంది యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో శనివారం ఈ ఘటన జరిగింది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. బృందావన్ హోటల్‌కు ఆనుకొని జాతీయ రహదారి నుంచి పలు కాలనీలకు వెళ్లేందుకు 25 ఏళ్ల క్రితం లే అవుట్లు చేసిన సమయంలో (సర్వే నంబర్ 175) రోడ్డు వేశారు. కొన్ని రోజులుగా కొందరు దీన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. 20 రోజుల క్రితం దారికి అడ్డంగా జేసీబీతో గుంత తవ్వారు. స్థానికులు అడ్డుకోవడంతో తిరిగి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా.. శనివారం మళ్లీ వందలాది మంది మహిళా కూలీలతో రోడ్డుకు నాలుగు వైపులా ఇనుప రేకులు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. స్థానిక ఆపిల్ ఎవెన్యూ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ రెడ్డితో పాటు సభ్యులు, వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు, మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. రోడ్డుపై ఎలాంటి నిర్మాణాలు, ఆక్రమణలు చేపట్టకూడదంటూ హెచ్చరించడంతో ఆక్రమణదారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, కాలనీవాసులకు ఇబ్బంది కలిగేలా రోడ్డుపై నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావిజయేందర్‌రెడ్డి.. కమిషనర్ రవీందర్ రెడ్డిని కోరారు.

నీటి సంరక్షణపై నిర్లక్ష్యం



హరిహరపురంలో ధ్వంసమైన ఇంకుడు గుంత

- ఇంకుడు గుంతల నిర్వహణ గాలికి • చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారిన వైనం • వృథాగా పోతున్న వర్షం నీరు

ఎల్‌బీనగర్: వాన నీటిని ఒడిసి పట్టేందుకు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల నిర్వహణను వాటర్ వర్క్స్ అధికారులు గాలికి వదిలేశారు. దీంతో ఇంకుడు గుంతలు చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ప్రతీ డివిజన్‌లో 2019 వాటర్ వర్క్స్ అధికారులు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. నీటి సంరక్షణపై ప్రజలకు గతంలో అవగాహన కల్పించడంతో పాటు వాటి నిర్వహణపై శ్రద్ధ తీసుకొనేవారు. తర్వాత అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో అప్పట్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు నేడు నిరుపయోగంగా మారాయి.



ఎస్‌కేడీ నగర్‌లో చెత్త డంపింగ్ యార్డుగా మారిన ఇంకుడు గుంత

శిథిలావస్థలో కొన్ని...

◆ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, మన్సూరాబాద్, చంపాపేట, గడ్డిఅన్నారం తదితర డివిజన్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపంతో వాటిలోకి ఇప్పుడు నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. కాలనీవాసులు ప్రస్తుతం వాటిలో తమ ఇళ్లలోని చెత్తను తెచ్చిపోస్తూ డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నారు.

◆ కొన్ని ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని ప్రాంతాల్లో వాటి ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. దీంతో వర్షం కురిసినప్పుడు నీరు ఇంకుడు గుంతల్లోకి పోకుండా రోడ్లపై వృథాగా పారుతోంది.

అధికారులు పర్యవేక్షణ లేకే..

◆ వర్షం నీరు రోడ్లపాలు కాకుండా ఇంకుడు గుంతల్లోకి చేరి బోర్లు రీచార్జ్ అవుతాయనే ఉద్దేశంతో వాటర్ వర్క్స్ అధికారులు అట్టహాసంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారని, ఇప్పుడు ఆ విభాగం అధికారుల పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారాయని పలువురు అంటున్నారు. ఇంటి అనుమతి కోసం దరఖాస్తు చేసే వారు తప్పనిసరిగా ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణం చేసుకోవడం అప్పట్లో తప్పనిసరి చేసిన గ్రేటర్ అధికారులు కూడా ఇప్పుడు ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు.

ప్రజలకు మరింత అవగాహన కల్పించాలి

భవిష్యత్ తరాలకు నీటి సమస్య రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకొనేలా ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలి. గతంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను పునరుద్ధరించి వాటి నిర్వహణను అధికారులు తరచూ పర్యవేక్షించాలి. అప్పుడే భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్య రాదు.

– ప్రసన్నకుమార్, బీఎన్‌రెడ్డినగర్

నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



లక్ష్మీభవానీనగర్‌లో పార్కు ప్రహరీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి అనునిత్యం సేవకుడిగా మీ ముందు ఉంటానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధిలోని లక్ష్మీభవానీనగర్ కాలనీలో చేపడుతున్న పార్కు ప్రహరీ పనులను కార్పొరేటర్ శనివారం పరిశీలించి బృందావన్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలనీలో మరో పార్కు స్థలానికి గేటు ఏర్పాటు చేయిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కాలనీలోని నీటి సమస్యను తెలుసుకున్న కార్పొరేటర్ జలమండలి అధికారులను కాలనీకి పిలిపించారు. నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు.కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజు, ఏటీఓ విశ్వనాథ్, నర్సింగ్‌రావు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నవీన్‌రావు, నరేంద్ర కుమార్, భూపాల్, శ్రీనివాస్‌రెడ్డి, రాధాకృష్ణ, రవీందర్, ముత్యాలు, భాను, శ్రీనివాస్, శివరామయ్య, నాయకులు కదారి యాదగిరియాదవ్, బాలాజీ రమేష్‌చారి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే బీసీ సంఘాల మద్దతు

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్



చంచల్‌గూడ: ఏ పదవి లేకున్నా ప్రజా సమస్యలపై పోరాడుతున్న తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా గెలిపించాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది ఎ. రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. కుర్మగూడ డివిజన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలోఆయన మాట్లాడుతూ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్ కుమార్)ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీసీ సంఘాలన్నీ కాంగ్రెస్ పార్టీకే మద్దతు పలుకుతున్నాయని ఆయన తెలిపారు. బీసీ రిజర్వేషన్ 50 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ పార్టీ చెప్పడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం పదాధికారులు కృష్ణమూర్తి, రవి చారి బాలరాజ్ గౌడ్, భిక్షపతియాదవ్, లక్ష్మయ్య, శ్రీనివాస్ చారి తదితరులున్నారు.

ఆ కార్యవర్గానికి చట్టబద్ధత లేదు

శివరామ ఆలయ ఛైర్మన్ మద్ది రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని జానకీ ఎన్‌క్లేవ్ కాలనీలోని శివరామ ఆలయ నూతన కార్యవర్గం చట్టబద్ధంగా ఎన్నుకున్నది కాదని, అది చెల్లుబాటు కాదని ఆలయ ఛైర్మన్ మద్ది రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ పాలక మండలి అత్యవసర సమావేశాన్ని శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, శివరామ ఆలయానికి కాలనీ సంక్షేమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని, 2006లో ఆలయం నిర్మించినప్పటి నుంచి ఆలయ నిర్వహణలో కాలనీ జోక్యం లేదని అన్నారు. అయితే, కాలనీ కొత్త సంక్షేమ సంఘం ఏర్పడినప్పటి నుంచీ ఆలయాన్ని అడ్డుపెట్టుకొని కొంతమంది రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. గతేడాది కూడా కాలనీ పాలక మండలికి సమాచారం లేకుండా నూతన పాలక మండలి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించడంతో సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు జోక్యంతో వెనకడుగు వేశారని, మళ్లీ ఇప్పుడు స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రోద్బలంతో ఆలయం తాళాలు పగలగొట్టి నూతన కమిటీ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సమావేశంలో ఆలయ వైస్‌ఛైర్మన్ సుభాష్ చంద్రారెడ్డి, కార్యదర్శి సతీష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రవీంద్రనాథ్, కోశాధికారి ఆంజనేయులు, సలహాదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింద తెలిపిన ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.



◆ **ఉ. 10 నుంచి 11.30 గంటల వరకు..**
గణేష్ టెంపుల్, సలీంనగర్, హీరోహోండా షోరూం బ్యాక్ సైడ్, రామాలయం స్ట్రీట్, రామచంద్రా ఐటీఐ, ఇంద్రసేనారెడ్డి పీటీ, శ్రీపురం కాలనీ రోడ్ పరిసర ప్రాంతాలు

◆ **ఉ 11.30 నుంచి మ. ఒంటి గంట వరకు...**
రిలయెన్స్ ట్రెండ్ మెయిన్‌రోడ్, పోస్టాఫీస్, జాస్మిన్ హోటల్, కేజీహెచ్ హాస్పిటల్, సలీంనగర్ మునిసిపల్ పార్క్, పరిసర ప్రాంతాలు.

◆ **మ. 2.30 నుంచి సా. 4.30 గంటల వరకు..**
మలక్‌పేట గంజ్, ప్రేమలత కాలనీ, అజీజ్‌పాషా, గంజ్ బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, చర్మాస్ ఎదురు ప్రాంతాలు.

◆ **చంపాపేట పరిధిలో..**
ఉ.11 నుంచి మ.1 గంట వరకు న్యూమారుతీనగర్, బాలాజీనగర్, ఉదయ్‌నగర్, సూర్యానగర్, సామసరస్వతి, క్రాంతినగర్, పద్మానగర్, లక్ష్మీనగర్, మైత్రిపురం, కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్.

◆ **సా.3 నుంచి 5 గంటల వరకు..**
పటేల్‌నగర్, శిఖర ఎన్‌క్లేవ్, రాఘవేంద్రనగర్, వైశాలీనగర్, నాగార్జున, ఆర్‌టీసీ, కేశవనగర్, ఎస్ఎన్‌రెడ్డి, భానునగర్, సింగరేణి కాలనీ ప్రాంతాలు.

◆ **రేపు రంగనాయకుల గుట్ట ఫీడర్ పరిధిలో...**
ఉ.11 నుంచి మ.ఒంటి గంట వరకు బ్రాహ్మణపల్లి, బ్రాహ్మణపల్లి ఏజీఎల్, కోహెడ ఏజీఎల్, తొర్రూర్ పరిధిలో సరఫరా ఉండదని ఏఈ రాములు తెలిపారు.

ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సాహెబ్ నగర్‌లోని త్రినేత్ర ఆంజనేయ స్వామి ఆలయ జాతర మహోత్సవానికి రామలింగేశ్వర స్వామి ఆలయం చైర్మన్ ముద్దగౌని సతీష్‌గౌడ్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ ఆలయ చైర్మన్ పెండ్యాల శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామిని దర్శించుకున్న సతీష్‌గౌడ్ దంపతులు

పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



చైతన్యపురి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షుడిగా చైతన్యపురికి చెందిన మల్లె కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు భరత్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. గతంలో ఈయన పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షుడిగా, సలహాదారుగా పనిచేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కృష్ణమూర్తి అన్నారు. తనను గౌరవ అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 33, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 31, ఆలు 31, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 15, అరటి 09, చిక్కుడు 75, అర్వి 40, మునగ 45, చిలగడదుంప 75, బీట్‌రూట్ 17, కీర 18. ఆదివారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ రోగి మృతి

- వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన



శంభయ్య (ఫైల్)

మన్సూరాబాద్: ఛాతీలో నొప్పి వస్తుందంటూ ఆసుపత్రిలో చేరిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే అతను చనిపోయాడంటూ మృతుడి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. శుక్రవారం రాత్రి ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి వద్ద ఈ ఘటన జరిగింది. మృతుడి బంధువుల కథనం ప్రకారం... సూర్యాపేట జిల్లా సోలిపేటకు చెందిన శంభయ్య (43) కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి హయత్‌నగర్‌లో స్థిరపడ్డాడు.శుక్రవారం ఉదయం ఛాతీలో నొప్పి వస్తోందని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షించిన వైద్యులు గుండెపోటు వచ్చిందని చెప్పి చికిత్స ప్రారంభించారు.రెండు గంటల తర్వాత శంభయ్య చికిత్సపొందుతూ చనిపోయాడని కుటుంబసభ్యులకు వైద్యులు తెలిపారు.చికిత్స వివరాలు చెప్పాలని వారు వైద్యులను కోరగా సమాధానం చెప్పకపోగా, చికిత్స ఖర్చులు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్లండి అని చెప్పారు. ఛాతీలో నొప్పి అంటూ నడుచుకుంటూ ఆస్పత్రికి వచ్చిన శంభయ్యకు వైద్యులు సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే మృతి చెందాడని పేర్కొంటూ శుక్రవారం రాత్రి 11 గంటలకు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు.

వైద్యుల నిర్లక్ష్యం లేదు..

ఆస్పత్రికి వచ్చినప్పుడే శంభయ్య ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు వైద్యులు తెలిపారని కామినేని ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు. ఆస్పత్రికి రాగానే ఐసీయూలో ఉంచి చికిత్స అందించామని, రోగి మృతికి వైద్యుల నిర్లక్ష్యం కారణం కాదన్నారు. రోగి కుటుంబసభ్యులు కేవలం రూ.15 వేలు చెల్లించినప్పటికీ చికిత్స అందించామని తెలిపారు.

బాలిక అదృశ్యం

సైదాబాద్: వేసవి సెలవులకు బంధువుల ఇంటికి వచ్చిన బాలిక ఆచూకీ లేకుండాపోయిన ఘటన సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సింగరేణి కాలనీలో నివసించే జీహెచ్ఎంసీ కార్మికురాలు బానోతు పార్వతి ఇంటికి నెల రోజుల క్రితం ఆమె అక్క కూతురు అంజలి(16) వేసవి సెలవులు గడిపేందుకు వచ్చింది. అంజలి ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. రెండు రోజుల క్రితం అంజలి తండ్రి బానోతు భోజ్యా ఫోన్ చేసి చదువు విషయమై ఆమెను మందలించాడు. అప్పటి నుంచి ముభావంగా ఉంటున్న అంజలి..శుక్రవారం తెల్లవారుజామున సోదరుడు శివ లేచి చూడగా ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యప్రదేశ్ సీఎంకు బీజేపీ నేతల సన్మానం



మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్‌ను సన్మానిస్తున్న సురేందర్‌రెడ్డి

సైదాబాద్: నగరంలో పలు కార్యాక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను బీజేపీ నాయకులు కలిసి సత్కరించారు. శనివారం ఉదయం నగరానికి చేరుకున్న ఆయనకు బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి బేగంపేట విమానాశ్రయంలో కలిసి స్వాగతం పలికారు. సురేందర్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో మలక్‌పేట, యాకత్‌పురా నియోజకవర్గాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట సమస్యలపై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కొత్తపేట డివిజన్‌లోని ఎస్ఆర్ఎల్ కాలనీ ప్రధాన రోడ్డులో వర్షపు నీరు వెళ్లడానికి గతేడాది ప్రారంభించిన బాక్స్ డ్రెయిన్ పనులను అసంపూర్తిగా నిలిపివేయడంతో వర్షాలు కురిసినప్పుడు రోడ్లన్నీ ధ్వంసమై ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నాలుగైదు కాలనీలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన దారి అని, బాక్స్ డ్రెయిన్ పనులు త్వరగా పూర్తి చేసి కొత్త రోడ్డు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరామన్నారు. సత్యానగర్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, భరత్ నగర్ కాలనీ ఫేజ్ 1–2, రాజీవ్ గాంధీ నగర్ ఫేజ్ 1–2ల్లో జలమండలి అధికారులు డ్రైనేజీ పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా.. ఇంకా రోడ్డు మరమ్మతులు చేయలేదన్నారు. దీంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని బురదమయంగా మారిందన్నారు. ఇక్కడ నూతన సీసీ రోడ్డు నిర్మించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు.

సిలిండర్ రీఫిల్లింగ్ ముఠా గుట్టు రట్టు

- జనావాసాల నడుమ నిర్వహిస్తున్న వైనం • జల్‌పల్లిలో ఎస్‌ఓటీ పోలీసుల దాడులు
- 91 సిలిండర్లు, ఫిల్లింగ్ సామగ్రి స్వాధీనం • నిందితుడు అరెస్ట్, పరారీలో మరొకరు



సిలిండర్లతో పట్టుబడ్డ నిందితుడు షేక్ రహమాన్

పహాడీషరీఫ్: జనావాసాల నడుమ ప్రమాదపుటంచున ప్రైవేట్ గ్యాస్‌ను భారత్, ఇండేన్ కమర్షియల్ సిలిండర్లలోకి ఫిల్లింగ్ చేస్తున్న ముఠా గుట్టును మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు శనివారం రట్టు చేశారు. ఏకంగా ఓ గోడౌన్‌నే ఏర్పాటు చేసుకొని కనీస జాగ్రత్తలు పాటించకుండా రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 91 గో గ్యాస్, భారత్, ఇండేన్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టకు చెందిన షేక్ రహమాన్(33), బబ్లులు కొన్నాళ్లుగా జల్‌పల్లి శ్రీరాం కాలనీలో ఓ గోడౌన్‌ను అద్దెకు తీసుకొని అందులో గుట్టు చప్పుడు కాకుండా ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. 'గో గ్యాస్' కంపెనీ సిలిండర్ల నుంచి వాణిజ్యానికి వినియోగించే భారత్, ఇండేన్ సిలిండర్లలోకి ఫిల్లింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఒకే ప్రదేశంలో ఇంత భారీ ఎత్తున రీఫిల్లింగ్ చేస్తున్న క్రమంలో ఏదైనా జరగరానిది జరిగితే ఊహకందని స్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లే ఆస్కారం ఉంది. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు, ఎస్సై రాజుల బృందం శనివారం దాడులు నిర్వహించి ఒక డిజిటల్ తూకం, 91 సిలిండర్లతో పాటు రీఫిల్లింగ్‌కు వినియోగించే 13 రీఫిల్లింగ్ రాడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రహమాన్‌ను తదుపరి విచారణ నిమిత్తం పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు. మరో నిందితుడు బబ్లూ పరారీలో ఉన్నాడు.

పట్టుబడ్డ సిలిండర్లు ఇవే

ఈ దాడుల సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 'గో గ్యాస్' కమర్షియల్ ఖాళీ సిలిండర్లు–34, నిండు సిలిండర్లు–13, భారత్ గ్యాస్ కమర్షియల్ నిండు సిలిండర్లు–15, ఖాళీ సిలిండర్లు–14, ఇండేన్ గ్యాస్ కమర్షియల్ ఖాళీ సిలిండర్లు–15గా ఉన్నాయి.

స్థానిక పోలీసులకు తెలియదా?

అక్రమ వ్యాపారాలకు కేంద్ర బిందువుగా ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ వ్యాపారాలు స్థానిక పహాడీషరీఫ్ పోలీసులకు తెలియకుండానే జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. పరస్పర సహకారం కారణంగానే మిన్నకుండి పోతున్నారన్న విమర్శలున్నాయి. ఎస్‌ఓటీ పోలీసులు వచ్చి దాడులు చేసేంత వరకు కూడా స్థానిక పోలీసులు తెలియనట్లుగా ఉండడమే ఈ ఆరోపణలకు ఊతమిచ్చేలా ఉంది.

సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలి



మూసారంబాగ్ హాస్టల్ ఎదుట మాట్లాడుతున్న వెంకటేష్

మలక్‌పేట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని సోషలిస్టు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి శనివారం ఆయన మూసారంబాగ్‌లోని హాస్టల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. రెండేళ్లుగా భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో వాటిని మూసివేయాల్సిన దుస్థితి ఏర్పడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న డైట్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్, వంశీ, నాగరాజు, వినోద్, చందు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.